క్లుప్తంగా

ప్రతి ఇంటికీ 'రాజ్యాంగాన్ని' అందజేయాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

బాలానగర్: ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ రాజ్యాంగ పుస్తకాన్ని ఇవ్వాలని కోరుతూ సోమవారం బాలానగర్ తహశీల్దార్ అహల్యకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పరశురాం, సురేష్, శ్రీనివాస్, శంకర్, శ్యామ్, కూర్మయ్య, వెంకటేష్, సురేష్, రాములు, రాజు పాల్గొన్నారు.

యువతకు క్రికెట్ కిట్ పంపిణీ

బాలానగర్: ఆటలు దేహ దారుఢ్యానికి, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయని బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం రాజు కాలనీకి చెందిన యువతకు క్రికెట్‌కిట్లను తన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో యువకులు పృథ్వీరాజ్ అనుదీప్, సందీప్, రాహుల్, జోనాహ్, జోనతన్, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల పట్ల యువకులు అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న మాధవరం కాంతారావు, వద్దేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: సోమవారం బాలానగర్‌లోని విజయదుర్గా టిఫిన్ సెంటర్ వద్ద డ్రగ్స్, మాదకద్రవ్యాలపై రిఫార్మ్ సంస్థ నిర్వాహకులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, సీనియర్ నాయకుడు వద్దేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. యువతీ యువకులను డ్రగ్స్ వంటి వాటికి బానిసలుగా మార్చి తద్వారా వ్యాపారాభివృద్ధితో దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి కొన్ని సంస్థలు పనిచేస్తున్నాయని వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

10 నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

మోతీనగర్: మోతీనగర్ అవంతినగర్ ప్రాంతంలోని శ్రీ శివరామాంజనేయ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు ఈ నెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ పునర్నిర్మాణ కమిటీటి ప్రధాన సేవకుడు రమేష్ అయ్యంగార్, చైర్మన్ మహేష్ యాదవ్ సోమవారం తెలిపారు. శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహా సంస్థాన పీఠాధీశ్వరులు శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామి ఆధ్వర్యంలో కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

శ్మశాన వాటిక సుందరీకరణ పనులు ప్రారంభం



శ్మశానవాటికను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ శ్మశాన వాటికలోని బండరాళ్లను తొలగించి సుందరీకరణ పనులను చేపట్టాలని స్థానికులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన సోమవారం అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. శంషీగూడ స్మశాన వాటికలో ఇప్పటికే ప్రహరీ నిర్మాణం పూర్తయిందని, మరుగుదొడ్లు, స్నానాల గదులు, పూజాగది వంటివి నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. నాయకులు జోగిపేట భాస్కర్ వెంకట్ నాయక్, కసాని శంకర్, వై. పాల్గొన్నారు.

పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలి



నాలా పనులను పరిశీలించిన కార్పొరేటర్ మహేందర్ తదితరులు

మోతీనగర్: స్నేహపురి కాలనీ నాలా పై కప్పు పనులను సోమవారం మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలా పై కప్పు పనులు నత్తనడకన చేస్తున్నారని త్వరగా పూర్తి చేయాలని ఏఈ రంజిత్‌కు సూచించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కాలనీ అధ్యక్షుడు వినోద్, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎర్రస్వామి పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీ పాటించాల్సిందే..

దూకుడు పెంచిన అధికారులు



అగ్ని ప్రమాదం జరిగిన దృశ్యం (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఫైర్ సేఫ్టీ విషయంలో అధికారులు దూకుడు పెంచారు. నగరం, నగర శివారు ప్రాంతాల్లో జరుగుతున్న అగ్ని ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని అన్ని వ్యాపార కేంద్రాల్లో ఫైర్ సేఫ్టీ విషయంపై అవగాహన కల్పించి వారికి సేఫ్టీ సర్టిఫికెట్ అందజేసేలా కూకట్‌పల్లి జోనల్ పరిధిలో పలు వ్యాపారాలు నిర్వహించే వారికి నోటీసులు తయారు చేస్తూ వస్తున్నారు.. మూసాపేట్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిళ్ల పరిధిలో చిన్న వ్యాపారం చేసుకునే 100 చదరపు మీటర్ల కంటే ఎక్కువ తక్కువ స్థలంలో ఉన్న భవనానికి వ్యాపారులు తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ సంబంధించిన పరికరాలు అమర్చుకోవాలని సూచించగా ఎవరి నుంచీ స్పందన కనిపించలేదు. దీంతో శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ లతో కుత్బుల్లాపూర్ సర్కిల్లో ఇప్పటివరకు 300కు పైగానే నోటీసులు జారీ చేసి ఫైర్ సేఫ్టీ పరికరాలు అమర్చుకోవాలని సూచిస్తూ ముందుకు సాగుతున్నారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా...

అగ్ని ప్రమాదాలు జరిగే సందర్భంలో ప్రతిసారి భారీగా ఆస్తి నష్టం వాటిల్లుతున్న నేపథ్యంలో గ్రేటర్ అధికారులు సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టారు. చిన్న చిన్న వ్యాపారం చేసుకునే వ్యాపారస్తులు తమ వస్తువులతో పాటు ప్రాణాలను అగ్ని ప్రమాదం జరిగే సమయంలో కాపాడుకునే దిశగా ఈ చర్యలు చేపట్టినట్లు జోనల్ కమిషనర్ మమత 'సాక్షి'తో అన్నారు. ప్రతి వ్యాపారస్తుడు ముందుకు రావాలని కోరారు. దుకాణదారుడు ఎస్టాబ్లిష్మెంట్ 100 చదరపు మీటర్లకు పౌడర్ ఇపై ఫైర్ సామాగ్రిని ఇన్‌స్టాల్ చేయాలి. అదే విధంగా పెట్రోల్ బంకులు ఆయిల్ షాపులు మొదలైన ఆయిల్ స్టోరేజీలు 100 చదరపు మీటర్లకు ఫైర్ సేఫ్టీ యంత్రం ఏర్పాటు చేయాలని, దుకాణదారులు 100 చదరపు మీటర్లకు రెండు స్మోక్ డిటెక్టర్లను ఇన్‌స్టాల్ చేసుకుంటే ప్రమాదాలు నివారించవచ్చని పేర్కొన్నారు.



కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి రంగారావు

కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని కమల ప్రసన్న నగర్ కాలనీలో పది లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన కమ్యూనిటి హాలును సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ రోజాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కమల ప్రసన్న నగర్ కాలనీ వాసులు విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం సీడీపీ ఫండ్స్ నుంచి 10 లక్షల రూపాయలను మంజూరు చేశామన్నారు. కమ్యూనిటీ హాలును సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పారిశుద్ధ్య కార్మికుల కృతజ్ఞతలు

ఆల్విన్‌కాలనీ: మేడే ను పురస్కరించుకొని పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు సీఎం కేసీఆర్ పెంచినందుకు సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని పారిశుద్ధ్య కార్మికులు మర్యాదపూర్వకంగా కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి, కార్పొరేటర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



అధికారులతో సమావేశమైన నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి..

నిజాంపేట్: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇంచార్జి కమిషనర్ రామకృష్ణరావు అధ్యక్షతన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా, రోడ్ల విస్తరణ, భూగర్భ డ్రైనేజీ నిర్మాణం, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలను సకాలంలో పూర్తి చేయాలని, పనులు చేపడుతున్న క్రమంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు విజయలక్ష్మి, ఆగం రాజుముదిరాజ్, ఇంజనీరింగ్, ఎస్ఎన్‌డీపీ, శానిటేషన్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బీఎస్పీకి మాదిగలు గుణపాఠం చెబుతారు



మాట్లాడుతున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: సామాజిక న్యాయాన్ని విస్మరించి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతివ్వని బీఎస్పీకి తెలంగాణ మాదిగలు తగిన గుణపాఠం చెబుతారని ఎంఎస్ఎఫ్ జాతీయ నాయకులు పేర్కొన్నారు. సోమవా రం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు సోమ శేఖర్‌మాదిగ, కార్యదర్శులు పల్లెర్ల సుధాకర్, మురళీకృష్ణ మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతు ప్రకటిస్తే బీఎస్పీతో కలిసి నడుస్తామని ఎమ్మార్పీఎస్ అధినేత మాయావతికి లేఖ రాసినా హైదరాబాద్‌లో జరిగిన సభలో వర్గీకరణ అంశాన్ని ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. దళితుల్లో మాదిగలు, ఉపకులాల ఓట్లు అడిగే నైతిక హక్కు బీఎస్పీకి లేదన్నారు. సమావేశంలో అజయ్ సామ్రాట్, నరేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ దుకాణం పేరుతో మోసం చేశారు

పంజగుట్ట: నిత్యావసర సరుకుల ఆర్గానిక్ దుకాణం పేరుతో మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు విలేకరుల ఎదుట వాపోయారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వింజమూరి మధు, మహేందర్ రెడ్డిలు మాట్లాడుతూ .. బాచుపల్లిలోని మల్లంపేటకు చెంది సంస్థ లోసన్స్ ఎంటర్‌ప్రైజెస్ నిత్యావసర సరుకుల ఔట్‌లెట్ 'ఘర్ నీడ్స్' పేరుతో ఇస్తామని నమ్మించారన్నారు. అందుకు రూ.12 లక్షలు పెట్టుబడి పెట్టామని తెలిపారు.అయితే ఆ తరువాత లాభాలు, వాటా ఇవ్వకపోవడంతో మోసపోయామని గ్రహించి ప్రశ్నిస్తే తప్పించుకు తిరుగుతున్నారన్నారు. పోలీసులను సంప్రదిస్తే సరిగా స్పందించడం లేదని వాపోయారు.తమకు న్యాయం చేయాలని కోరారు.

వైద్యులకు శిక్షణ



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలోని డాక్టర్ రావూస్ ఈఎన్‌టి ఆసుపత్రిలో వినికిడి లోపం ఉన్న చిన్నారులకు శస్త్ర చికిత్సలు నిర్వహించే వైద్యులకు, ఆడియోలాజిస్టులకు, శిక్షణ తరగతులు నిర్వహించారు. మూడు రోజుల పాటు సాగిన ఈ శిక్షణ తరగతులలో విదేశాల నుంచి తెప్పించిన అధునాత యంత్రాల సహాయంతో చిన్నారుల వినికిడి లోపం రావడానికి గల కారణాలు, వినికిడి లోపాన్ని అధిగమించేందుకు చేయాల్సిన శస్త్ర చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ రావూస్ ఇ.ఎన్.టి డైరెక్టర్ డాక్టర్ శ్రీ రావు పాల్గొన్నారు.

పాఠశాల నిర్మాణానికి సహకరించండి



మూసాపేట: మూసాపేట మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు సోమవారం గల్ఫ్ ఆయిల్ కార్పొరేషన్ ఎస్టేట్ ఆఫీసర్ మోహిత్ కర్నల్‌ను కలిసి ప్రభుత్వ పాఠశాల నిర్మాణం కోసం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శంకర్ నాయక్, సుశీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ కాంట్రాక్టు ఉద్యోగులపై వివక్షత తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగులపై వివక్షత తగదని సంఘం నాయకులు డాక్టర్ పరుశురాములు,డాక్టర్ ధర్మతేజ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోని ఇంటర్, డిగ్రీ, వృత్తి విద్యా కాలేజీలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పర్మినెంట్ చేసి కేవలం యూనివర్సిటీల అధ్యాపకులను పక్కన పెట్టడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి వర్సిటీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా సాగుతాం

- బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్
- పీజేఆర్‌నగర్, గుల్షన్‌నగర్, పాన్‌మక్తాలో గడపగడపకూ బీజేపీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా సాగుతామని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. కొండాపూర్ డివిజన్ లోని పీజేఆర్ నగర్, గుల్షన్‌నగర్, పాన్‌మక్తాలలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతికాలనీ, బస్తీలో డ్రైనేజీ సమస్య, రోడ్లు తదితర సమస్యలు ఉన్నాయని, వాటన్నింటిని పరిష్కరించేందుకు తగిన ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ప్రస్తుతం పాదయాత్ర ద్వారా ప్రతికాలనీలో సమస్యలను గుర్తించడం జరుగుతోందని, ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను కూడా పరిష్కరించేలా చేస్తామన్నారు. శేరిలింగంపల్లిలోని అన్ని డివిజన్లలోని కాలనీలు,బస్తీలలో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, బీజేపీ నాయకులు మన్యంకొండ సాగర్, చెన్నయ్య, చంద్రశేఖర్‌యాదవ్, రాధాకృష్ణ యాదవ్, ఎల్లేష్, అనిల్‌కుమార్ యాదవ్,రవినాయక్, భరత్ గోపాలకృష్ణరాజు, మఖన్‌సింగ్, బంటి మేరీ పాల్గొన్నారు.

పెళ్లి జరుగుతుండగా..పేలిన ఏసీ మిషన్

- నరేన్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఘటన
- రూ. 7.50 లక్షలు తీసుకుని కనీస వసతులు కల్పించలేదని బంధువుల ఆందోళన



నరేన్‌గార్డెన్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న దృశ్యం

మియాపూర్: ఒక వైపు పెళ్లి జరుగుతుండగా భారీ శబ్దంతో ఏసీ మిషన్ పేలిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నరేన్ నక్షత్ర ఫంక్షన్‌హాల్‌లో చోటుచేసుకుంది. వధువు, వరుడు కుటుంబ సభ్యులు , స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం నిజాంపేట్‌కు చెంది కొల్లి సంజీవరెడ్డి కూతురు లాస్య వివాహం మియాపూర్‌లోని నరేన్‌గార్డెన్ నక్షత్ర ఏసీ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఉదయం నుండి పరిమిత సంఖ్యలో ఏసీలు పని చేస్తున్నా అందరూ ఇబ్బందిపడ్డారు. ఫంక్షన్‌హాల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదన్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఒక్కసారిగా ఏసీ బ్లాస్ట్ అయ్యింది. దీంతో పెళ్లి మండపంలో ఉన్న బంధువులు భయంతో పరుగులు తీశారు. సుమారు వెయ్యిమంది వరకు పెళ్లిలో ఉన్నారు.అయితే ఎలాంటి ప్రమాదం జరగపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఫంక్షన్‌హాల్‌కు ఏడున్నర లక్షలు కట్టించుకున్నారు. ఏసీ ఫంక్షన్‌హాల్ అని చెప్పారు. కనీస వసతులు లేక పోగా ప్రజల ప్రాణాలతో ఫంక్షన్‌హాల్ యాజమాన్యం చెలగాటమాడుతున్నారని నరేన్ గార్డెన్ కార్యాలయం ముందు వారు ఆందోళనకు దిగగా.. అక్కడ సిబ్బంది ఈ ఫంక్షన్‌హాల్‌లో ఇలాంటి సంఘటనలు సర్వసాధారణమే అని మా యజమానులు ఓ పార్టీలో ఉన్నారని ఏమైనా చేసుకోండని బెదిరిస్తున్నారని బంధువులు చెప్పారు. కార్యాలయం ముందు ఆందోళన విషయం తెలుసుకున్న మియాపూర్ పోలీసులు నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

కోనసీమ అందం ఆవిష్కృతమయ్యేలా..





కోనసీమ అందం ఆవిష్కృతమయ్యేలా శంకర్ నిర్మించిన ఆర్చ్ సందర్శకులను ఆకట్టుకుంటుంది. శిల్పారామంలో కోనసీమకు ప్రధాన ద్వారంగా వెదురు బొంగులతో ఆర్చ్‌ను ఆర్టిస్ట్ శంకర్ తయారు చేశారు. దీనిని ఫైబర్‌తో దాదాపు నెల రోజుల పాటు నిర్మించారు. దాదాపు రూ.4.5 లక్షల నుండి రూ. 5లక్షల వరకు అయ్యిందని అధికారులు తెలిపారు. సెలవులు కావడంతో సందర్శకులు ఎక్కువగా వస్తున్నారని పచ్చదనం పెంపునకు వివిధ రకాల పూల మొక్కలను నాటుతున్నట్టు తెలిపారు. – మాదాపూర్

వర్సిటీల అభివృద్ధికి సీఎం కృషి



ఓయూలో మాట్లాడుతున్న పద్మారావుగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఓయూ ఉద్యోగులు ఏర్పాటు చేసిన ఈద్- మిలాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్, యూజీసీ డీన్ మల్లేష్, టీఎన్‌జీవో అధ్యక్షులు రాజేందర్, ఎన్‌జీవోస్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ముస్లిం ఉద్యోగులు లేకున్నా ఈద్ మిలాపా?

ఓయూలో ముస్లిం ఉద్యోగులు లేకున్నా ఈద్-మిలాప్ జరపడం తగదని పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు. గతంలో ముస్లిం ఉద్యోగులు సుమారు 400 వరకు ఉండేవారని వారి కోసం ప్రతి ఏటా ఆనవాయితీగా ఈద్ మిలాప్ జరిపేవారని ఉద్యోగ విరమణలు నియామకాలు జరపనందున ప్రస్తుతం ముస్లిం ఉద్యోగులు 30 మంది కూడా లేరన్నారు. పండుగ పేరుతో రాజకీయం చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టి ముస్లిం రిజర్వేషన్లను పాటించాలని డిమాండ్ చేశారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌లు, అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కేపీహెచ్‌బీ, బాలాజీనగర్, అల్లాపూర్, కూకట్‌పల్లి డివిజన్‌లకు సంబంధించిన పార్కులు, డ్రైనేజీ రోడ్లు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 17 కోట్ల రూపాయలను మంజూరు చేశారు. అన్ని పార్కుల్లోని కాంపౌండ్ వాల్ నిర్మాణాలను పటిష్టంగా చేపట్టాలని, అదే విధంగా పార్కుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మరో 20 కోట్లతో ఓపెన్ జిమ్‌లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీష బాబూరావు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ..

కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను 123 మంది లబ్ధిదారులకు సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చెక్కులను పంపిణీ చేశారు. ఇప్పటికు 16 వేల మంది లబ్ధి పొందారని పేర్కొన్నారు.

ప్రతి డివిజన్‌లో క్రీడా మైదానాలు, ఓపెన్‌జిమ్‌లు

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని 15వ ఫేజులో నూతనంగా ఏర్పాటు చేసిన టెన్నిస్ గ్రౌండ్‌ను సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో క్రీడలను ప్రోత్సహిస్తూ క్రీడా మైదానాలను, ఓపెన్‌జిమ్‌లను, పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, వీటిని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.